గోలివాడలో సమ్మక్క జాతరకు ముమ్మర ఏర్పాట్లు 8లో..

కోల్‌బెల్ట్‌లో సమ్మక్క జాతర సందడి 8లో..


మినీ స్టేడియానికి కేటాయించిన మైదానం



# అలంకారప్రాయంగా మినీ స్టేడియం



దొంగలపాలైన తలుపులు కిటికీలు

- ప్రారంభోత్సవానికి నోచుకోకుండానే శిథిలావస్థకు..
- రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 18: లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన సుల్తానాబాద్ మినీ స్టేడియం నిరుపయోగంగా మారింది. క్రీడాకారులతో కళకళలాడాల్సిన స్టేడియం ప్రారంభోత్సవానికే నోచుకోక పోవడం విచారకరం. ఏళ్లు గడుస్తున్నా మినీ స్టేడియాన్ని పట్టించుకునే ప్రజాప్రతినిధులు, అధికారులే కరువయ్యారు. ఎందరో క్రీడాకారులకు పుట్టినిల్లు అయిన సుల్తానాబాద్ పట్టణంలో తరచూ క్రీడలు నిర్వహించేందుకు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు, వివిధ స్థాయిల్లో క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు నిర్మించిన ఈ మినీ స్టేడియంలో ఏనాడు క్రీడలు నిర్వహించిందీ లేదూ.. క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిందీ లేదు.. దీంతో ఇరవై ఏళ్లుగా ఈ మినీ స్టేడియం నిరుపయోగంగా మారింది. మినీ స్టేడియంలోని గదుల్లో విద్యుత్ వైరింగ్, ఇతర సౌకర్యాలు అన్ని పూర్తి చేశారు. పైన నీటి ట్యాంకును కూడా ఏర్పాటు చేశారు. కానీ భవనానికి సంబంధించిన గదుల తలుపులు కిటికీలు, ప్లాస్టిక్ నీళ్లట్యాంకు దొంగల పాలయ్యాయి. ఎంతో మంది అధికారులు, ప్రజా ప్రతినిధులు మారినా మినీ స్టేడియం గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు..

**● క్రీడాకారులకు నిలయం..**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో క్రీడాకారులకు నిలయంగా సుల్తానాబాద్ పేరు గాంచింది. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పలువురు క్రీడాకారులు పాల్గొని పతకాలు సాధించి సుల్తానాబాద్‌కు ఖ్యాతి తెచ్చారు. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో భారత ఖోఖో జట్టుకు గెల్లు మధుకర్ రెండు సార్లు ప్రాతినిధ్యం వహించి బంగారు పతకాలు సాధించారు. 55సార్లు జాతీయ క్రీడల్లో పాల్గొని బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారు. అలాగే బైరగోని రవీందర్‌గౌడ్ దాదాపు ఇరవైకి పైగా జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొని బంగారు రజత, కాంస్య పతకాలు సాధించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఖోఖో జట్టును సీనియర్స్ విభాగంలో ఆరుసార్లు రాష్ట్రస్థాయి విజేతగా నిలిపారు. ఇక సిలివేరి మహేందర్ దాదాపు పది జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. అలాగే గాజుల రాజమల్లు, వెంకట ఉమాపతి, ముస్తాఫా, లచ్చన్న, దాసరి రమేష్, చిట్టి, గుణపతి, తిరుపతి, మహేష్, గోలి సుధాకర్, యాకూబ్, బాలసాని రాజ్‌కుమార్, కుమార్ కిశోర్, ప్రభాకర్, సంపత్, కామ సంజీవ్ ఇక్బాల్ తదితరులు వివిధ క్రీడల్లో రాణించారు.



నిరుపయోగంగా ఉన్న మినీ స్టేడియం భవనం

**● ముకుందరెడ్డి ప్రత్యేక చొరవతో..**

గతంలో అప్పటి ఎమ్మెల్యే గీట్ల ముకుందరెడ్డి ప్రత్యేక చొరవతో సుల్తానాబాద్‌లో మినీ స్టేడియం మంజూరైంది. స్థానిక సర్పంచ్ అంతటి పుష్పలతఅన్నయ్యగౌడ్ తదితరుల కృషి ఫలితంగా 2005లో సుల్తానాబాద్ పట్టణంలోని సర్వేనంబర్ 779లోగల 4ఎకరాల ప్రభుత్వ భూమిలో మినీ స్టేడియం నిర్మించేందుకు నిర్ణయించారు. మొదటి విడతగా ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం పనికి ఆహార పథకం కింద రూ.11 లక్షల నిధులు మంజూరు చేసింది. చకచకా పనులు కూడా పూర్తి అయ్యాయి. అయితే నిధులు సరిపోకపోవడంతో మరోసారి స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో మరో 10 లక్షల రూపాయలను మంజూరు చేయించారు. భవనంతో పాటు ఒక పక్క కొంతభాగం ప్రహరీ నిర్మించారు. పనులు అసంపూర్తిగా ఉన్న తరుణంలోనే ఆనాటి ఎమ్మెల్యే, ప్రభుత్వం మారడంతో తర్వాత వచ్చిన ఎమ్మెల్యేలు ఎవరూ మినీ స్టేడియం గురించి పట్టించుకోలేదు. దీంతో ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. ఫలితంగా లక్షలు వెచ్చించి నిర్మించిన మినీ స్టేడియం అలంకారప్రాయంగా మారింది.

### ఎమ్మెల్యేను ఒప్పించి మంజూరు చేయించాం..

**- అంతటి అన్నయ్యగౌడ్, మాజీ సర్పంచ్**



మినీ స్టేడియం 2005లో అప్పటి ఎమ్మెల్యే గీట్ల ముకుందరెడ్డి పెద్దపల్లికి మంజూరుచేయించారు. కానీ అక్కడ స్థలం లేకపోవడంతో సుల్తానాబాద్‌లో అనువైన ప్రభుత్వ స్థలాలున్నాయని ఎమ్మెల్యేను ఒప్పించి సుల్తానాబాద్‌కు మార్పించాం. కొన్ని పనులు పూర్తికాగా, ప్రభుత్వం మారడంతో నిధుల సమస్య ఏర్పడి పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. అనేకసార్లు నిధుల కోసం ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశాం. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కపైసా కూడా కేటాయించకపోవడంతో పనులు అలాగే ఉండిపోయాయి.

### ఇప్పటికైనా వినియోగంలోకి తేవాలి..

**- గాజుల రాజమల్లు, జాతీయ స్థాయి ఖోఖో క్రీడాకారుడు**



సుల్తానాబాద్ పట్టణంలో క్రీడాకారుల సౌకర్యార్థం ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ తదితర క్రీడల నిర్వహణ కోసం నిర్మించిన మినీ స్టేడియంను ఇప్పటికైనా వినియోగంలోకి తీసుకురావాలి. క్రీడాకారులకు తగిన శిక్షణ ఇస్తూ రాష్ట్ర, జిల్లాస్థాయి క్రీడలను నిర్వహించాలి. క్రీడాకారులకు అనుగుణంగా స్టేడియంను ప్రభుత్వం తీర్చిదిద్దాలి.

### ప్రహరీ నిర్మాణం చేపట్టాలి..

**- అమిరిశెట్టి తిరుపతి, స్పోర్ట్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి**



మినీ స్టేడియంలో అసంపూర్తిగా మిగిలిన ఉన్న పనులను వెంటనే పూర్తిచేయాలి. గతంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆనాటి ఎమ్మెల్యే గీట్ల ముకుందరెడ్డితో పాటు స్థానిక నేతల చొరవతో ఈ మినీ స్టేడియంను నిర్మించారు. కానీ ప్రహరీ నిర్మాణం చేపట్టకపోవడంతో రాత్రి వేళల్లో మందుబాబులకు అడ్డాగా మారింది. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా ప్రహరీ నిర్మించి మినీ స్టేడియంను పూర్తి స్థాయిలో వినియోగంలోకి వచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

**● జోరుగా అసాంఘిక కార్యకలాపాలు..**

మినీ స్టేడియం గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. స్టేడియం చుట్టూ ప్రహరీ నిర్మించకపోవడం వలన మైదానంలో పశువులు సంచరిస్తున్నాయి. ఇటీవల తెలంగాణ క్రీడా ప్రాంగణం పేరిట అధికారులు బోర్డును ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. కనీసం భవనాన్ని ఏదైనా ప్రభుత్వ కార్యాలయానికి వినియోగించినా బాగుండేదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలి

**- గోదావరిఖని ఏసీపీ మడత రమేష్**



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏసీపీ రమేష్

మంథని, ఫిబ్రవరి 18: పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతంగా సేవలందించాలని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ సూచించారు. ఇటీవల గోదావరిఖని ఏసీపీగా బాధ్యతలుగా స్వీకరించిన అనంతరం తొలి సారి ఆయన మంథని పోలీస్ స్టేషన్‌ను ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను ఆయన పరిశీలించడంతో కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతంగా తమ విధులను నిర్వర్తించాలన్నారు. అదే విధంగా సైబర్ క్రైమ్, గంజాయి వినియోగదారులు, సరఫరా దారలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో సమర్థవంతంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మంథని సీఐ రాజు, ఎస్ఐలు వెంకట్‌కృష్ణ, రాణి, పోలీసులు పాల్గొన్నారు.

## మల్లన్న సన్నిధిలో భక్తుల రద్దీ



మల్లన్న ఆలయంలో క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు

ఓదెల, ఫిబ్రవరి 18 : మండల కేంద్రంలోని మల్లన్న క్షేత్రంలో భక్తుల రద్దీ నెలకొంది. భ్రమరాంబ శ్రీ మల్లికార్జున స్వామి దర్శనానికి ఆదివారం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులకు మూడు గంటల సమయం పట్టింది. బుధవారం 21 నుంచి 24 వరకు వన దేవతల జాతర నేపథ్యంలో రోజురోజుకీ ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువైంది. వివిధ జిల్లాల నుంచి సమ్మక్క-సారలమ్మ జాతరకు తరలివెళ్లే భక్తులంతా ఓదెల మల్లన్న క్షేత్రానికి తరలివచ్చి దర్శించుకున్నారు. అనంతరం భక్తులంతా పట్నాలు, కోడెమొక్కులను, బోనాలను సమర్పించారు. అలాగే బంగారు పోచమ్మ తల్లికి, మదన పోచమ్మ తల్లికి కుటుంబాల వారిగా తరలివచ్చిన భక్తులంతా మొక్కులు చెల్లించారు. ఆలయానికి అధికసంఖ్యలో భక్తులంతా తరలిరావడంతో దర్శన సమయంలో క్యూ లైన్‌లో పిల్లాపాపలతో వచ్చినవారు ఇబ్బందులకు గురయ్యారు. దర్శనం కోసం ఏర్పాటుచేసిన క్యూ లైన్ ఇరుకుగా ఉండటం వల్ల మల్లన్న దర్శనానికి భక్తులకు ఎక్కువ సమయం పట్టింది.

## గోదావరి వంతెన వద్ద శాశ్వతంగా జాతర ఏర్పాట్లు

**- భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం**

**- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్**



జాతర ప్రాంతంలో సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, ఫిబ్రవరి 18: గోదావరి వంతెన వద్ద ఈనెల 21 నుంచి 24 వరకు జరిగే సమ్మక్క-సారలరమ్మ జాతరను ఇక నుంచి శాశ్వతంగా జరిగేందుకు ఏర్పాట్లను చేస్తున్నట్లు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ చెప్పారు. ఆదివారం జాతరలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసారి కనీవిని ఎరుగని రీతిలోజాతర ఏర్పాట్లను చేస్తున్నట్లు, సింగరేణి, ఎన్‌టీపీసీ, మున్సిపల్ కార్పొరేషన్, ఆర్ఎఫ్‌సీఎల్ సహకారంతో అన్ని విభాగాల అధికారులతో సమన్వయం చేస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాతర ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది సుమారుగా 5లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేసినట్లు, వారికి కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేశామన్నారు. పవిత్ర గోదావరిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడంతోపాటు మహిళల కోసం ప్రత్యేకంగా షెడ్ల ఏర్పాటు చేశామని, గద్దెల వద్ద ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు పరిశుభ్రత పాటించాలని కోరారు. అన్ని శాఖల అధికారులతో గత నెల రోజులుగా జాతర ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దామని, ఆయా శాఖల అధికారులు ఎలాంటి లోటుపాట్లు లేకుండా భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. రెండేళ్లకోసారి జాతర కాకుండా నిత్యం వచ్చే విధంగా భక్తుల కోసం శాశ్వత ఏర్పాట్లను చేస్తున్నామని, జాతరలో 300విద్యుత్ దీపాలు, గుడి ముందు శాశ్వతంగా హాల్‌ను నిర్మించినట్లు చెప్పారు.

ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ వెంట ఈఓ కాంతారెడ్డి, కార్పొరేటర్లు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, కొలిపాక సుజాత, నాయకులు కాల్వ లింగస్వామి, చుక్కల శ్రీనివాస్, దీటి బాలరాజు, పాతిపెల్లి ఎల్లయ్య, ఉల్లంగుల రమేష్, జాతర కమిటీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కనకయ్య ఉన్నారు.

# మేడారం జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

**- ప్రారంభించిన ఎమ్మెల్యేలు, అధికారులు - భక్తులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి**



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు



జాతర బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 18: మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర కోసం ప్రత్యేకంగా వేసిన బస్సులను ఆదివారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్దపల్లి పాయింట్ నుంచి జాతర నిమిత్తం ఆర్టీసీ 193 ప్రత్యేక బస్సులు వేసిందన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న మహిళలకు ఉచిత ప్రయాణం పథకం వర్తిస్తుందన్నారు. మహిళలందరు సామ్మక్క సారలమ్మలను దర్శించుకోవాలని సూచించారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ సంస్థ అన్ని ఏర్పాట్లు చేయడంతో పలు సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జీ డిపో మేనేజర్లు సునితా, విజయ మాధూరి, నాయకులు నూగిళ్ళ మల్లయ్య, బినుపాల ప్రకాష్ రావు, బూతగడ్డ సంపత్, సందనవేన రాజేందర్, బొడ్డుపెల్లి శ్రీనివాస్, జగదీష్, పోగుల శ్రీకాంత్, గంగుల వెంకటేష్ పాల్గొన్నారు.

### గోదావరిఖనిలో..

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 18: గోదావరిఖని బస్ డిపో నుంచి మేడారం సమ్మక్క జాతరకు వెళ్లే భక్తుల కోసం ఏర్పాటుచేసిన బస్సులను, కౌంటర్లను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ కొంగు బంగారమైన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు భక్తుల కోసం ప్రభుత్వం 6,000 ప్రత్యేక బస్సులను నడుపుతోందని, ఆర్టీసీ బస్సులో వెళితే సమ్మక్క-సారలమ్మ గద్దెలకు సమీపంలోకి వెళ్లవచ్చునని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారని, గోదావరిఖని బస్టాండ్‌లో భక్తుల కోసం తాగునీరు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశామని, 140 మంది సిబ్బంది, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు భక్తులకు సహాయం చేస్తారని పేర్కొన్నారు.

**లహరి బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే..**

కాగా, గోదావరిఖని ఆర్టీసీ డిపో నుంచి బెంగుళూరుకు నూతనంగా ప్రవేశపెట్టిన లహరి బస్సు సర్వీసులను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రయాణీకులకు సౌకర్యవంతంగా ప్రయాణించేందుకు కొత్త బస్సులను అందుబాటులోకి తీసుకువస్తుందన్నారు. మక్కాన్‌సింగ్ స్వయంగా లహరి బస్సులను డీఎం నాగభూషణంతో కలిసి గోదావరి వంతెన వద్ద ఉన్న సమ్మక్క-సారలమ్మ జాతర వరకు బస్సును నడిపారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ మడక రమేష్, కార్పొరేటర్లు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, కొలిపాక సుజాత, నాయకులు కాల్వ లింగస్వామి, పాతిపెల్లి ఎల్లయ్య, మారెల్లి రాజిరెడ్డి, పొలుసాని శ్రీనివాస్, దీటి బాలరాజు, ఉల్లంగుల రమేష్, దూళికట్ట సతీష్, అడప దశరథం, చుక్కల శ్రీనివాస్, డిపో ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ గీత కృష్ణతో పాటు ఆర్‌టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

### మంథనిలో..

మంథని, ఫిబ్రవరి 18: మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరకు మంథని నుంచి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను ప్రారంభించారు. మంథని ఆర్టీసీ డిపో మేనేజర్ అలువాల రాజశేఖరం, అధికారులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపో మేనేజర్ అలువాల రాజశేఖరం మాట్లాడుతూ.. మంథని ఆర్టీసీ డిపో నుంచి బస్సులను మేడారం సమ్మక్క, సారలమ్మ జారతకు నడిపిస్తున్నామన్నారు. భక్తుల సౌకర్యార్థం మంథని ఆర్టీసీ బస్టాండ్‌లో టెంట్లు, తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లను చేయడంతో పాటు నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. మంథని నుంచి మేడారం పెద్దలకు రూ.320, పిల్లలకు రూ.180గా టికెట్ ధరను నిర్ణయించామని తెలిపారు. మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. మేడారం వెళ్లే భక్తులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ, మెట్‌పల్లి డీఎంలు మురళీకృష్ణ, వేదవతిలతో పాటు ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మంథనిలో బస్సును ప్రారంభిస్తున్న అధికారులు



లహరి బస్సుకు జెండా ఊపుతున్న ఎమ్మెల్యే, అధికారులు

## గోదావరిఖని - బెంగుళూరు సర్వీసులను వినియోగించుకోండి

**- ఆర్టీసీ డీఎం నాగభూషణం**

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 18: గోదావరిఖని నుంచి బెంగుళూరుకు నూతనంగా రెండు స్లీపర్ క్లాస్ లహరి బస్సులను ఉపయోగించుకోవాలని ఖని ఆర్టీసీ డిపోమేనేజర్ నాగభూషణం కోరారు. అంతర్‌రాష్ట్ర, ఇతర రాష్ట్ర ప్రయాణికుల కోసం ఏసీ స్లీపర్ కం సీటర్ బస్సులను ప్రవేశపెట్టడం జరిగిందని, గోదావరిఖని బెంగుళూరుకు 22 సిట్టింగ్ సీట్లు, 20స్లీపర్ బెర్త్‌లను ఈ బస్సులో ఉంటాయని, 15అప్పర్‌బెర్త్‌లు, 5లోయర్ బెర్త్‌లు, హైస్పీడ్ ఫ్రీవైఫై, ఇంటీరియల్ సీసీ కెమెరా, వెహెకిల్ ట్రాకింగ్ సిస్టం, ఫుల్‌ఎయిర్ కండీషన్, మొబైల్‌చార్జింగ్, మినరల్‌వాటర్‌బాటిల్స్, స్నాక్స్, ఫైర్ సేఫ్టీ అలారమ్, రేయర్ వ్యూ కెమెరా, వ్యక్తిగత లగేజీస్టాండ్, బెడ్‌షీట్లు సౌకర్యాలుంటాయన్నారు. బెంగుళూరుకు స్లీపర్‌బెర్త్ పెద్దలకు రూ. 2920, సిట్టింగ్ సీట్ రూ.1840, జేబీఎస్‌కు బెర్త్ రూ.870, సిట్టింగ్ రూ.690, ఎంజీబీఎస్‌కు స్లీపర్ బెర్త్ రూ.910, సిట్టింగ్ సీట్‌కు రూ.740 టికెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సర్వీసులను ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

## ద్విచక్ర వాహనం పైనుంచి పడి తీవ్ర గాయాలు

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 18: కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రం నుంచి గంగారంకు వెళ్లే దారిలో ఆదివారం టేకుమట్ల మండలం వెలిశాల గ్రామానికి చెందిన మల్లయ్య అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై పడి తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో కాల్వ శ్రీరాంపూర్ నుంచి కారులో పెద్దపల్లికి వెళ్తున్న మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ తలకు గాయమైన మల్లయ్యను తన డ్రైవర్ సహాయంతో కారులో ఎక్కించుకుని కాల్వ శ్రీరాంపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం బాధితుడి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ఓంకార్‌యాదవ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మల్లయ్యకు మెరుగైన వైద్య చికిత్స కోసం పెద్దపల్లికి తరలించారు. మల్లయ్యను సకాలంలో ఆసుపత్రికి తీసుకు రావడం పట్ల అతని కుటుంబ సభ్యులు సారయ్యగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.







## వ్యవసాయ కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన

గంభీరావుపేట, ఫిబ్రవరి 18: గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామంలో జగిత్యాల జిల్లా పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఆదివారం క్షేత్రస్థాయి పర్యటన చేశారు. గ్రామీణ వ్యవస్థాపక అవగాహన అభివృద్ధి యోజన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు కార్యక్రమాన్ని చేపట్టారు. రైతులు సాగు చేస్తున్న పంటల విధానం, దిగుబడి తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. సామాజిక వనరులు, సమస్యల చెట్టు, కాలానుగున పటం తదితర అంశాలపై ముగ్గులతో చిత్రాలు వేసి రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో గౌతమి, సాయి తేజ, అజయ్, మాజీ సర్పంచ్ సరళ రాజనర్సింహరెడ్డి, నాయకులు సేనరెడ్డి, రాజు, శ్రీనివాస్, నరసింహ పొలాస విద్యార్థులు ఉన్నారు.


కొత్తపల్లిలో అవగాహన కల్పిస్తున్న పొలాస విద్యార్థులు

## జాతీయ స్థాయి ఉత్సవాలకు చిల్వకోడూర్ విద్యార్థులు


జాతీయ స్థాయి ఉత్సవాలకు ఎంపికైన విద్యార్థులు

గొల్లపల్లి, ఫిబ్రవరి 18 : నేటి నుంచి ఢిల్లీలో జరగనున్న కబ్, బుల్ బుల్ ఉత్సవాలకు గొల్లపల్లి మండలం చిల్వకోడూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులు ఆదివారం దేశ రాజధానికి తరలివెళ్లారు. ప్రతి యేటా జాతీయ స్థాయిలో కబ్, బుల్ బుల్ ఉత్సవాలను కేంద్ర విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తుంటారు. మూడు ఏళ్లుగా కరోనా మహమ్మారి కారణంగా ఉత్సవాలను నిర్వహించలేదు. ఈ యేడు నిర్వహిస్తుండడంతో తెలంగాణ రాష్ట్రం తరపున చిల్వకోడూర్ విద్యార్థులు ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఆహ్వానం అందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎల్. అరుణ తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాల విద్యార్థులు పాల్గొనే ఈ ఉత్సవాలకు మన రాష్ట్రం తరపున మా విద్యార్థులు ఎంపికవడం గర్వకారణంగా ఉందని ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. పాఠశాలకు చెందిన గట్ల అభినవ్, కూన సాయి, బద్రి అనిరుద్, సికినికాంతం శివసాయి, గౌడికర్ రుత్విక్, ఒల్లాల రుషి అనే విద్యార్థులు కబ్ బుల్ బుల్ ఉత్సవాలకు ఎంపికయ్యారు. కబ్ గ్రీటింగ్, జంగిల్ ప్లే, బాలుర నృత్యం, ఉత్సవ్ మేళా తదితర అంశాల్లో ఎంపికైన విద్యార్థులకు కబ్ మాస్టర్ వినోద్ గౌడ్ శిక్షణ ఇచ్చినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

## కుక్కల దాడిలో 28 గొర్రెలు మృతి

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 18: జగిత్యాల మండలం మోతె గ్రామంలో ఆదివారం కుక్కలు గొర్రెలపై దాడి చేసి గాయపర్చిన సంఘటనలో 28 గొర్రెలు మృతి చెందాయి. అలాగే జగిత్యాల రూరల్ మండలంలోని హన్మాజీపేట గ్రామంలో గతంలో కుక్కలు పశువులపై దాడిచేయడంతో పశువులు మృతిచెందిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల్లోని పలు గ్రామాల్లో కుక్కల బెడద అధికమైంది. రద్దీకూడళ్లు, రోడ్ల వెంట కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ దాడులకు దిగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల్లోని పలు గ్రామాల్లో ఏదోఒకచోట నిత్యం కుక్కకాటు భాదితులు ఉంటున్నారు.


మృతిచెందిన గొర్రెలు

## అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 18: తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీలో అనారోగ్యంతో గుండం రాజు(32) అనే యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా అంబారిపేట గ్రామానికి చెందిన గుండం రాజు మూడు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకుని ఇందిరమ్మకాలనీలో జీవిస్తున్నాడు. రెండు సంవత్సరాల క్రితం ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లగా అనారోగ్యం బారిన పడి ఏడు నెలల క్రితం స్వదేశానికి తిరిగి వచ్చాడు. అనారోగ్యంతో పనిచేయలేని పరిస్థితిలో తీవ్ర మనస్తాపానికి గురైన రాజు ఆదివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### కారు బోల్తా : ముగ్గురికి గాయాలు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 18: సిరిసిల్ల పట్టణం బైపాస్ రహదారి కల్వర్టుపై అతివేగంగా వెళ్తున్న ఓ కారు బోల్తా పడింది. ఆదివారం రాత్రి రగుడు బైపాస్ నుంచి వెంకటాపూర్ వైపు ముగ్గురు ప్రయాణికులతో కారు అతి వేగంగా వెలుతూ డ్రైవర్ బ్రేకు వేయడంతో కల్వర్టు వద్ద మూడు పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని టౌన్ ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



# ఎస్సారెస్పీ డీ-53 ఉప కాలువ కబ్జా

గొల్లపల్లి, ఫిబ్రవరి 18: గొల్లపల్లి మండలం బొంకూర్ రెవెన్యూ శివారులోని ఎస్సారెస్పీ డీ-53 ఉప కాలువను కొందరు రైతులు పూడ్చి వేయడంతో ఆయకట్టు కింది రైతుల పంట పొలాలకు సాగు నీరందడం లేదు. అరుగాళం చమటోడ్చి సాగు చేసిన పంట పొలాలకు సాగు నీరందక కళ్లెదుటే ఎండి పోతుండడంతో బాధిత రైతాంగం ఆందోళన చెందుతోంది. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బొంకూర్ గ్రామ రెవెన్యూ శివారులో ఎస్సారెస్పీ డీ-53 కాలువ కింద ఆయకట్టు కింది రైతుల పంట భూములకు సాగు నీరందించేందుకు దశాబ్దాల క్రితం ఉప కాలువ (పిల్ల కాలువ)ను రైతుల పంట భూముల్లోంచి నిర్మించారు. అయితే, ఇటీవల కాలంలో కొందరు రైతులు ఉప కాలువను చదును చేసి కబ్జా చేయడంతో ప్రస్తుతం అక్కడ ఉప కాలువ నామరూపాల్లేకుండా పోయింది. అక్కడక్కడ కొందరు రైతులు కాలువను ముట్టుకోకుండా ఉంచగా, అందులో పిచ్చి మొక్కలు పెరిగి, బండరాళ్లు పడి అస్తవ్యస్తంగా తయారై కింది పంట భూములకు సాగు నీరందని దుస్థితి నెలకొంది. కొందరు రైతులు కాలువను పూడ్చివేసి యథేచ్ఛగా పంటలను సాగు చేస్తున్నారు. సుమారు 80 ఎకరాలకు సాగు నీరందించేందుకు ఈ ఉప కాలువను ఏర్పాటు చేసినట్లు రైతులు పేర్కొంటున్నారు. అయితే, మీది రైతులు కాలువను కబ్జా చేయడంతో ఆయకట్టు కింది రైతుల పంటల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. అసలే, ఎస్సారెస్పీ డీ-53 చివరి ఆయకట్టుకు సాగు నీరు ఎప్పుడొస్తదో తెలియని పరిస్థితుల్లో ఆయకట్టు కింది చివరి పంట భూములకు సాగు నీరందక రైతులు తల్లడిల్లుతున్నారు. దీనిపై గతంలో జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదని పలువురు బాధిత రైతులు వాపోతున్నారు. అంతేకాకుండా ఆడిషనల్ కలెక్టర్ ఉప కాలువను పునరుద్ధరించాలని ఇచ్చిన ఆదేశాలను సైతం బేఖాతరు చేసినప్పటికీ సంబంధిత అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి ఉప కాలువను పునరుద్ధరించి ఆయకట్టు కింది పంట పొలాలకు సాగు నీరందించాలని బాధిత రైతాంగం కోరుతున్నారు.



డీ-53 కాలువలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు



పూర్తిగా తొలగించిన ఉప కాలువ

### సాగు నీరందక పంటలు ఎండిపోతున్నాయి
### - మాదాసు కార్తీక్, యువరైతు, బొంకూర్

ఎస్సారెస్పీ డీ-53 ఉప కాలువ కింద 8 ఎకరాల సాగు భూమి ఉంది. ఎస్సారెస్పీ సాగునీటిని నమ్ముకుని పంటలు సాగు చేస్తున్నాం. ఎగువ ప్రాంతంలో ఉన్న కొందరు రైతులు ఉప కాలువను పూర్తిగా పూడ్చి వేసి కాలువను కబ్జా చేశారు. దీంతో తమ పంట పొలాలకు సాగు నీరందక ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి సాగు చేసిన పంటపొలాలు ఎండిపోయే ప్రమాదం పొంచిఉంది. దీనిపై గతంలో పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఆరుగాళం కష్టించి సాగు చేసిన పంట చేతికందకుండా పోతే తమ కుటుంబాలు పస్తులుండాల్సిందే. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి ఉప కాలువను పునరుద్ధరించి పంటపొలాలకు సాగు నీరందించాలి.

### మా దృష్టికి రాలేదు
### -మహేష్, ఎస్సారెస్పీ ఏఈ

ఎస్సారెస్పీ డీ-53 ఉప కాలువ కబ్జాకు గురైనట్లు తమ దృష్టికి రాలేదు. ఆయకట్టు కింది చివరి పంట భూములకు సాగు నీరందించేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నాం. ఎస్సారెస్పీ కాలువలను క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. ఇప్పటివరకు మండలంలోని అబ్బాపూర్ - లొత్తునూర్ గ్రామాల మధ్య ఉన్న డీ-53 కాలువ గూర్చి ఫిర్యాదులు అందినవి. బాధిత రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దానిని క్షేత్రస్థాయిలో పరిశీలించాం. అయితే, అక్కడ వరి పంట వేయడం వల్ల పరిష్కారానికి కొంత సమయం పడుతుంది. యాసంగి వరి పంటల కోతలు పూర్తి కాగానే సమస్యను పూర్తిగా పరిష్కారిస్తాం.

# రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ

వేములవాడ, ఫిబ్రవరి 18: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి దేవస్థానం ఆదివారం భక్తులతో రద్దీగా మారింది. మేడారం సమ్మక్కసారలమ్మ జాతరకు ముందు శ్రీ రాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకునే ఆనవాయితీ ప్రకారం ఆదివారం పెద్దసంఖ్యలో భక్తులు వేములవాడకు తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, శీఘ్ర దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకొని శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. అధిక రద్దీ కారణంగా గర్భాలయ ప్రవేశం నిలిపివేసి శీఘ్ర దర్శనం అమలు చేస్తున్నారు. బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. భారీ సంఖ్యలో భక్తులు బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గత వారంతో పోలిస్తే భక్తుల సంఖ్య స్వల్పంగా తగ్గినప్పటికీ స్వామివారి దర్శనం త్వరగా జరగడానికి వీలుగా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేపట్టారు.



క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

### రాజన్న సేవలో సంగారెడ్డి ఎస్పీ

వేములవాడ: రాజరాజేశ్వరస్వామి వారిని సంగారెడ్డి జిల్లా ఎస్పీ సి. రూపేష్ దర్శించుకున్నారు. ఆదివారం ఆయన కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ పర్యవేక్షకులు బి తిరుపతిరావు, ప్రొటోకాల్ పర్యవేక్షకుడు సిరిగిరి శ్రీరాములు స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ చెక్కిళ్ల అశోక్, సీఐ కరుణాకర్, ఎస్ఐ దిలీప్ ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోనరావుపేట, ఫిబ్రవరి 18 : కోనరావుపేట మండలం సుద్దాల గ్రామశివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇదరికి గాయాలు అయ్యాయి. వివరాల ప్రకారం కనగర్తి గ్రామానికి చేందిన కాదాసు వేణు అదే గ్రామానికి చేందిన మరో వ్యక్తి వేములవాడ నుండి తన ద్విచక్ర వాహనంపై కనగర్తి గ్రామానికి వస్తుండగా సుద్దాల గ్రామ శివారలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సుద్దాల నుండ్డి ఎదురుగా వస్తున్న కారు బైకును డీ కోట్టి వేల్లి పోయింది. దీంతో ఇద్దరి కిందపడి పోగ కాదాసు వేణుకు కాలు విరుగగా మరోకరికి గాయాలు అయ్యాయి. విరి ఇ ద్దరిని 108 అంబులెన్స్‌లో సిరిసిల్ల జిల్లా అస్పత్రికి తరలించారు.

## ప్రయాణికురాలి బ్యాగు నుంచి రూ. లక్ష మాయం

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 18: సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్‌లో ఓ ప్రయాణికురాలి నుంచి లక్ష రూపాయలు మాయమైన సంఘటన ఆదివారం వెలుగుచూసింది. కోనరావుపేట మండలంలోని మల్కపేట గ్రామానికి చెందిన లిఖిత ఓ బ్యాగులో లక్ష రూపాయలు పెట్టుకొని ముస్తాబాద్‌లోని ఓ శుభకార్యానికి హాజరయ్యేందుకు ఇంటి వద్దనే ఆటో ఎక్కింది. సిరిసిల్లలోని పాత బస్టాండ్‌కు చేరుకొని ముస్తాబాద్ వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కింది. బస్సు ఎక్కిన కొంతసేపటికి ఆమె బ్యాగ్ చూసుకుంది. అందులో ఉన్న లక్ష రూపాయలు మాయం అయ్యాయి. ఇంతకీ ఆ రూ. లక్ష బస్సులో ఎక్కేటపుడు ఎవరైనా కొట్టేశారా, ఆటోలో వచ్చేటపుడే ఎవరైనా తీసుకున్నారా అనేది ప్రయాణికురాలికి తెలియడం లేదు. దీంతో బస్సు దిగి పోలీసులకు సమాచారం ఇచ్చింది. టౌన్ సీఐ రఘుపతి, టౌన్ ఎస్ఐ శ్రీనివాసరావు పాతబస్టాండ్ చేరుకొని ఆర్టీసీ బస్సును తనిఖీ చేశారు. దీంతో ఆ బస్సు దాదాపు అరగంట ఆగిపోయింది. ఆ తర్వాత ఆటోలో వచ్చిన ప్రయాణికుల వివరాలను సేకరించారు. ఎక్కడా ఆ డబ్బుల జాడలేదు. చివరికి బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ రఘుపతి తెలిపారు.

## చెట్టు పైనుంచి పడి ఒకరి మృతి

ధర్మారం, ఫిబ్రవరి18: ధర్మారం మండలం నందిమేడారం గ్రామానికి చెందిన పీసు రఘునందన్‌రెడ్డి(65) ఆదివారం ఉదయం చెట్టుపై నుంచి పడి ప్రమాదవశాత్తు కాలు జారి మృతిచెందాడు. రఘనందన్‌రెడ్డి చింతకాయలు తెంపడానికి చెట్టు పైకి ఎక్కాడు. చింతకాయలు తెంపుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడు రవీందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

## ప్రమాదకరంగా రహదారులు



ప్రమాదకరంగా ఉన్న రహదారి

రాయికల్, ఫిబ్రవరి 18: రాయికల్ మండలంలో రహదారులు ప్రమాదకరంగా మారాయి. రాయికల్ నుంచి కోరుట్ల వెళ్లే రహదారిలో మైతాపూర్ బస్టాండ్ వద్ద గతంలో వర్షాలధాటికి ఆర్ అండ్ బీ రోడ్డుకు పోసిన మట్టి కొట్టుకుపోయింది. దీంతో వాహనదారులు భయం గుప్పిట్లో ప్రయాణిస్తున్నారు. రాత్రి పూట సమయంలో వెళ్లే వాహనదారులు ఏమాత్రం పట్టు కోల్పోయినా ప్రాణాలకే నష్టం కలుగుతుంది. ఇప్పటికైనా అధికారులు రోడ్డుకు ఇరువైపులా మట్టి పోసి భద్రత కల్పించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. రోడ్లు బాగు చేసి ప్ర

### ఐఐటీ సదస్సుకు ముగ్గురు ఎస్జీటీలు

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 18: గుజరాత్ రాష్ట్రంలోని గాంధీనగర్ ఐఐటీలో ఈనెల 21 నుంచి జరగనున్న వర్క్‌షాప్‌లో జిల్లా నుంచి ముగ్గురు సెకండరీ గ్రేడ్ టీచర్లు పాల్గొనబోతున్నారు. సెంటర్ ఫర్ క్రియేటివ్ లెర్నింగ్ సిసిఎల్ ఆధ్వర్యంలో మూడు విడతలుగా ఈ కార్యశాల నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన కర్రే ప్రవీణ్, జూలపల్లి మండలానికి చెందిన నల్ల రాజేందర్ రెడ్డి, పాలకుర్తి మండలానికి చెందిన సిహెచ్ కుమార్‌లు ఈ వర్క్ షాప్‌లో పాల్గొంటారని జిల్లా విద్యాధికారి కార్యాలయ వర్గాలు వెల్లడించారు. గతవారం గణితం టీచర్లు వర్క్‌షాప్‌లో పాల్గొనగా మార్చి మొదటి వారంలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు ఐఐటీ గాంధీనగర్ కార్యశాలలో పాల్గొననున్నారు. కాగా ఈ నెల 21 నుంచి ఆంగ్ల భాష ఉపాధ్యాయులు జిల్లాకు చెందిన ముగ్గురు ఎస్జీటీలను ఎంపిక చేసి పంపుతున్నట్లు వారు పేర్కొన్నారు.

## ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న కాలనీవాసులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 18: సిరిసిల్ల పట్టణం మానేరు వాగులో నుంచి ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను అయ్యప్ప కాలనీవాసులు ఆదివారం అడ్డుకున్నారు. అనంతరం సంఘటన స్థలానికి వచ్చిన పోలీసులు, ట్రాక్టర్ యజమానాలతో అయ్యప్ప కాలనీ వాసులు వాగ్వాదం చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ సిరిసిల్ల అయ్యప్ప కాలనీ నుంచి ఇసుక ట్రాక్టర్లు వెల్లడంతో రోడ్లు చెడిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పట్టణ పోలీసులు, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో కాలనీ వాసులందరం కలిసి ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నామన్నారు. జేసీబీతో రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్లు వెల్లకుండా గోతి తీయడానికి యత్నించడంతో పోలీసులు, ట్రాక్టర్ల యజమానులు అడ్డుకున్నారు. తమ వీధుల నుంచి వందల సంఖ్యలో ట్రాక్టర్లు వెల్తుండడంతో పిల్లలు పాఠశాలలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారని, దుమ్ము లేవడంతో తరుచూ అనారోగ్యాల బారిన పడుతున్నామని కాలనీవాసులు ట్రాక్టర్ యజమానులను నిలదీశారు. స్థానిక అవసరాల కోసం తాము ఇసుక అనుమతులతో తీసుకెల్తున్నామని ట్రాక్టర్ యజమానులు కాలనీవాసులకు తెలిపారు. రోడ్లు చెడిపోతే రోడ్డు గుంతలను పూడుస్తామన్నారు. అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని సమస్యల పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో గొడవ సద్దు మనిగింది.

### గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి



రమేష్‌గౌడ్(ఫైల్)

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 18: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందనే మనోవేదనతో కరీంనగర్ జిల్లా కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పూదరి రమేష్‌గౌడ్ (40) గుండెపోటుతో ఆదివారం మృతిచెందాడు. రమేష్‌గౌడ్ 16 సంవత్సరాలుగా ఆటోను నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంత కాలంగా ఆటోలో గిరాకీ లేక కుటుంబాన్ని ఎలా పోషించేదని, నెల వారి ఈఎంఐలు ఎలా కట్టేదని తీవ్ర వేదనకు గురయ్యాడు. ఆదివారం ఛాతిలో నొప్పి వస్తుందని కుప్ప కూలి పోగా, వెంటనే కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. ఆటో డ్రైవర్ కుటుంబానికి ప్రభుత్వం పది లక్షల రూపాయల పరిహారం చెల్లించాలని ఆటో డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు.

# ఇండియా కూటమి నినాదం 'బీజేపీకి హటావో.. దేశ్‌కి బచావో..'

- మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు నిర్మించి కేసీఆర్ మొదటి తప్పు చేశాడు
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 18 : వామపక్షాలు, ప్రజాతంత్ర, ప్రగతిశీల శక్తులు లౌకికశక్తులతో కలసి 'బీజేపీకి హటావో దేశ్‌కి బచ్చావో' నినాదంతో ఇండియా కూటమి ప్రజల వద్దకు వెళ్తుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెంకటరెడ్డి మాట్లాడారు. బీజేపీ, ఎండీఏ కూటమిని ఓడించడానికి ఇండియా కూటమిలోని కాంగ్రెస్ పార్టీ అందరని కలుపుకొని పోవాలని లేకుంటే కాంగ్రెస్‌కే నష్టమన్నారు. సాగునీటి చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలి, రైతులకు మద్ధతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరోనాతో కనీస సౌకర్యాలు లేక దేశ వ్యాప్తంగా దాదాపు 20 కోట్ల కార్మికులు పొట్ట చేత్తోపట్టుకొని వలసలు వెల్తున్నారని అన్నారు. వ్యవసాయదారులు, కార్మికులను కేంద్ర ప్రభుత్వం బజారు పాలు చేస్తుందని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా ధరలను పెంచి సామాన్యుడి నడ్డివిరుస్తున్న నరేంద్ర మోది ప్రభుత్వం మరోసారి ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తుందన్నారు. మోది ప్రభుత్వం బాలరామున్ని తీసుకొచ్చి రామరాజ్యం అంటుందన్నారు. రామరాజ్యం అంటే డ్రోన్ల ద్వారా రైతులపై భాష్పవాయువు ప్రయోగించడమా, లాఠీ చార్జీ చేయడం అన్ని ప్రశ్నించారు. రాముడు తండ్రికి ఇచ్చిన మాటకు కట్టుబడి అరణ్యవాసం చేశాడు. నరేంద్ర మోదీ ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి లేదు అన్ని అబద్దాలేనని అమలు కాని మాటలేనని ఆరోపించారు. మతోన్మాదం తీసుకొచ్చి మరోసారి ప్రజాస్వామ్యంను కూనీ చేయడానికి ప్రయత్నిస్తే మీ నాటకాలు సాగవని హెచ్చరించారు. మొదటి నుండి శ్రీరాంసాగర్ వరదకాలువ, ఎగువమానేరు వచ్చే వరదకాలువలు ఎందుకు కాలేదని ప్రశ్నిం చారు. మీ అధికారంతో ఇష్టానుసారంగా మీ ప్రాంతాలలో పనులను చేసుకు న్నారని ప్రభుత్వ నిధులను వాడుకున్నారని ఆరోపించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, పట్టణ కార్యాదర్శి పంతం రవి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం బాలమహేష్, జంగం అంజన్న, అజ్జ వేణు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

# తాండ్ర్యాలలో పశువుల కొట్టం దగ్ధం

కథలాపూర్, ఫిబ్రవరి 18: మండలంలోని తాండ్ర్యాలలో ఆదివారం మధ్యాహ్నం బద్దం గంగారెడ్డి అనే రైతుకు చెందిన పశువుల కొట్టం దగ్ధమైంది. మంటలు చెలరేగడంతో గ్రామస్థులు అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేసే ప్రయత్నం చేశారు. తదనంతరం ఫైర్ ఇంజిన్ రావడంతో సిబ్బంది మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించారనే అనుమానాలు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. కొట్టంలో ఉన్న పశుగ్రాసంతో పాటు విలువైన టేకు దుంగలు, ఇతరత్రా వ్యవసాయ సంబంధిత వస్తువులు కాలి బూడిదయ్యాయి. మధ్యాహ్నం వేళ కావడం వల్ల పశువులు కొట్టం లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. బాధిత రైతు కుటుంబం రోదిస్తోంది. ఈ ఘటనలో సుమారు రూ.6 లక్షల ఆస్తి నష్టం జరిగిందని రైతులు తెలిపారు.



తాండ్ర్యాలలో దగ్ధమైన పశువుల కొట్టం

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మల్యాల, ఫిబ్రవరి 18: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు ఆదివారం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గొల్లపల్లెకు చెందిన పెరుగు శేఖర్(25)అనే యువకుడు శనివారం రాత్రి జగిత్యాల నుంచి వస్తుండగా రాజారం వద్ద శేఖర్ ద్విచక్రవాహనం, మరో ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. దీంతో శేఖర్ తలకు తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం జగిత్యాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి కరీంనగర్ తీసుకెళ్లగా ఆదివారం వేకువజామున చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## గోలివాడలో సమ్మక్క జాతరకు ముమ్మర ఏర్పాట్లు




గోలివాడ సమ్మక్క - సారలమ్మ గద్దెలు

అంతర్గాం, ఫిబ్రవరి 18: మండల పరిధిలోని గోలివాడ శివారు గోదావరి తీర ప్రాంతంలో జరిగే సమ్మక్క-సారలమ్మ జాతర కొలిచే భక్తుల కొంగు బంగారంగా నిలుస్తోంది. జాతర ప్రదేశం ఎల్లంపల్లి ప్రాజెక్టు దిగువన ఉండడంతో భక్తులు స్నానాలు ఆచరించడానికి అనుకూలంగా ఉంటుంది. జాతర ప్రదేశానికి అవతల వైపు మంచిర్యాల జిల్లా ఉండగా అటువైపు నుంచి వచ్చే భక్తుల కోసం గోదావరిలో తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేశారు. జాతరకు పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలతో పాటు మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. 2022లో జరిగిన జాతరలో సుమారు 4లక్షల మంది భక్తులు తరలిరాగా, సుమారు 17.8లక్షలు కానుకల రూపంలో ఆదాయం సమకూరింది. ఈనెల 21నుంచి 24వరకు జరిగే జాతరకు గోదావరిఖని బస్టాండ్ నుంచి బస్సులు నడుపనున్నట్టు ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు. జాతరకు వచ్చే భక్తుల కోసం జాతర కమిటీ, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో తాగునీటి సౌకర్యం, వీధిదీపాల ఏర్పాటు, మరుగుదొడ్ల నిర్మాణం, విడిది కోసం 30ఎకరాల భూమి చదును చేశారు. ఈసారి గోదావరిలో నీటిమట్టం తగ్గడంతో మంచిర్యాల వైపు నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్టుగా సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

### 42ఏళ్లుగా జాతర నిర్వహిస్తున్నాం..

**- పెండ్రు హనుమాన్‌రెడ్డి, జాతర కమిటీ చైర్మన్**



గోలివాడ శివారు గోదావరి తీర ప్రాంతంలో 1982 నుంచి 42ఏళ్లుగా సమ్మక్క జాతరను నిర్వహిస్తున్నాం. మొదట్లో వేల సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ఇప్పుడు లక్షలాదిగా తరలివస్తున్నారు. జాతరకు తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

## ధర్మారంలో జాతరకు సర్వం సిద్ధం



ధర్మారంలో జాతరకు ముస్తాబైన సమ్మక్క-సారలమ్మ గద్దెలు

ధర్మారం, ఫిబ్రవరి 18: మండల కేంద్రంలో శీతల్ల చేరువు సమీపంలో నిర్వహించే సమ్మక్క-సారలమ్మ జాతరకు ఏర్పాట్లుచేశారు.గతంలో నిర్మించిన గద్దెలను తొలగించారు. వైభవంగా జాతరను నిర్వహించేందుకు అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో వచ్చిన విరాళాలతో ఆ ప్రదేశంను చదును చేసి పెద్ద సైజులో గద్దెలను పునర్నిర్మించారు. అక్కడికి భక్తులు వెళ్లడానికి నూతనంగా రోడ్డు నిర్మాణ పనులను పూర్తిచేశారు. జాతర మహోత్సవ అడహక్ కమిటీ కన్వీనర్ మేడవేని తిరుపతి, కోశాధికారి ఓరెం చిరంజీవి ఆధ్వర్యంలో నిర్మాణ పనులు పూర్తిచేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు కల్పించారు.

### భక్తులకు అన్ని సౌకార్యాలు కల్పించాం.

**- మేడవేని తిరుపతి, జాతర అడహక్ కమిటీ కన్వీనర్**

సమ్మక్క-సారక్క జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాం. జాతర జరిగే ప్రదేశంలో భక్తులకు నీడ కల్పించేందుకు టెంట్‌లను ఏర్పాటుచేశాం. ధర్మారం-ఎండపల్లి బైపాస్ రోడ్డులో గౌతమబుద్ధ ఫంక్షన్ హాల్ నుంచి నేరుగా జాతర జరిగే ప్రదేశం వద్దకు వాహనాలు వెళ్లేందుకు రోడ్డు మార్గాన్ని నిర్మించాం. జాతర జరుగుతున్న సమయాల్లో తాగునీటి సౌకర్యం, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లు పూర్తిచేశాం.

### జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు

జగిత్యాలఅర్బన్, ఫిబ్రవరి 18 : జిల్లా స్థాయి బాక్సింగ్ సబ్‌జూనియర్ బాలురు, బాలికల పోటీలు సోమవారం జిల్లా మినీస్టేడియంలో జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. 1-01-2010 నుంచి 31-12-2011 సంవత్సరం మధ్యలో జన్మించినవారు ఈ పోటీలకు అర్హులన్నారు. ఆసక్తి కలవారు ఆధార్‌కార్డు, పుట్టినరోజు ధ్రువపత్రంతోపాటు రెండుపాసుపోర్ట్ సైజు ఫొటోలు తీసుకొనిరావాలని సూచించారు. ఈ పోటీల్లో విజేతలు సికింద్రాబాద్ లాలాగూడ రైల్వే ఇనిస్టిట్యూట్‌లో జరిగే రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారని జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేందర్, కార్యదర్శి గువ్వ శ్రీనివాస్ తెలిపారు. ఆసక్తి గలవారు 9441773080 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

### పోచమ్మ ఆలయంలో చోరీ

మల్యాల, ఫిబ్రవరి 18: మండలంలోని ముత్యంపేటలో గల పోచమ్మ ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఆలయంలోని హుండీని పగులగొట్టి అందులోని దాదాపు రూ.20వేల నగదుతో పాటు వెండి వస్తువులను అపహరించుకుపోయారు. నగదుతో పాటు బంగారు, వెండి ఆభరణాలు, వస్తువులను కూడా గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు ఆలయ నిర్వహకులు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### పుస్తె, మట్టెలు పంపిణీ

రాయికల్, ఫిబ్రవరి 18: మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన పాడి రై తు బేతి ఆనంద్ రెడ్డి-భాగ్యల కూతురు వి వాహనికి పుస్తె మట్టెలను కరీంనగర్ డె యిరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వర్‌రావు ఆదివా రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్య క్షుడు అంబల్ల రాజారెడ్డి, అసిస్టెంట్ మేనే జర్ లక్ష్మీపతి, బీసీయూ ఇన్‌ఛార్జి రాధాకృష్ణ, సూపర్‌వైజర్ భరతపు రాజేష్, కార్యదర్శి బె క్కెం సుధాకర్ పాల్గొన్నారు.

# కోల్‌బెల్ట్‌లో సమ్మక్క జాతర సందడి

**- నిలువెత్తు బంగారం, యాటతో మొక్కులు**



నిలువెత్తు బంగారం తూకం వేయించుకుంటున్న తల్లీబిడ్డలు

కళ్యాణ్‌నగర్/మార్కండేయకాలనీ, ఫిబ్రవరి 18: తెలంగాణ కొంగు బంగారం అయిన సమ్మక్క-సారలమ్మ జాతరకు పది రోజుల ముందు నుంచే కోల్‌బెల్ట్ ప్రాంతం సందడిగా మారింది. ఏ ఇంట్లో చూసినా సమ్మక్క మొక్కులు, నిలువెత్తు బంగారం, యాటతో, కోళ్లతో వన దేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈనెల 21 నుంచి 24వరకు జాతర జరుగనున్న నేపథ్యంలో ఆదివారం గోదావరిఖని ప్రాంతంలో దుకాణాల వద్ద భక్తులు అమ్మవార్లకు తల్లి చల్లగా చూడాలంటూ నిలువెత్తు బంగారం(బెల్లం) మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఇండ్ల వద్ద అమ్మను ఆరాధించుకుని సమ్మక్క జాతరకు పయనమవుతుంటారు. ఈసారి కూడా పెద్దఎత్తున ఇండ్లలో మొక్కులు చెల్లించుకుంటారు. వారం రోజుల ముందు నుంచే జాతరకు వెళ్లి అమ్మకు మొక్కులు చెల్లించుకుని రావడం ఈప్రాంతవాసుల ప్రత్యేకం. ఆదివారం నుంచి నేరుగా మేడారానికి బస్సులు ప్రారంభం కావడంతో చాలామంది పయనమవుతున్నారు. మేడారం దర్శించుకున్న తరువాత స్థానికంగా ఉన్న జాతర వద్ద కూడా మొక్కులు చెల్లించుకుంటారు.

# సమ్మక్క జాతరతో ధరలకు రెక్కలు..

**- సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు - బేజారవుతున్న భక్తులు**



కోళ్లను కొనుగోలు చేస్తున్న భక్తులు

మంథని, ఫిబ్రవరి 18: మేడారం మహా జాతర సందర్భంగా మేకలు, గొర్రెలు, కోళ్లు, వాహనకిరాయిలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి. దీంతో భక్తులు బేజారు అవుతున్నారు. వన దేవతలైన శ్రీసమ్మక్క-శ్రీ సారక్కలకు బంగారం(బెల్లం), జంతు బలులే మహా నైవేద్యంగా భక్తులు సమర్పిస్తారు. మేడారం జాతర వచ్చిందంటే చాలు మేకలు, గొర్రెలు, కోళ్ల అమ్మకాలు జోరుగా సాగుతుంటాయి. అమ్మవార్లకు బంగారం(బెల్లం), జంతువులను, కోళ్లను బలిచ్చి, మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. వన దేవతలు సైతం జంతుబలులను మహా నైవేద్యంగా స్వీకరిస్తారనే విశ్వాసం భక్తుల్లో బలంగా ఉంది. అందుకే జాతర సందర్భంగా మేడారం వెళ్లే ముందు ఇంట్లో సమ్మక్క-సారక్కలకు ప్రత్యేక పూజలు చేసి బెల్లం పంచిపెట్టడం, కోళ్లు, మేకలను బలి ఇవ్వడం జరుగుతుంది. మేడారం జాతరలో సైతం ఇదే విధంగా భక్తులు పూజలు చేస్తారు. తిరిగి ఇంటికి వచ్చిన తరువాత కూడా మరోసారి ఈ విధంగానే వన దేవతలకు ఎదురుకోళ్ల పేరిట పూజించడం ఆనవాయితీగా వస్తోంది. మొత్తం మూడుసార్లు వనదేవతలకు నిర్వహించే ఈ పూజల్లో ఇతర ప్రాంతాల్లో ఉన్న కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో పాల్గొని విందు, వినోదాలతో సంతోషంగా భక్తులు గడుపుతుంటారు. ఈ నేపథ్యంలో జంతు బలులకు ఉపయోగించే కోళ్లు, మేకలు, గొర్రెలకు భారీగా డిమాండ్ పెరిగింది. సీజన్‌ను దృష్టిలో పెట్టుకున్న జంతు విక్రయదారులు నెల క్రితం నుంచే క్రమేపి రేట్లను పెంచడం ప్రారంభించారు. మేకల మందల వద్ద ఉదయం, సాయంత్రం కొనుగోలుదారుల సందడి కొనసాగుతోంది. లక్షలాది మంది జాతరకు వెళ్లడాన్ని దృష్టిలో పెట్టుకొని పెరిగిన డీజిల్, పెట్రోల్ ధరల కారణంగా కార్లు, టాటాఏస్‌లు, ఆటోలు, ట్రాక్టర్లు, లారీలు, వ్యాన్ల ధరలను విపరీతంగా పెంచారు. మొత్తంగా మేడారం జాతర సందర్భంగా కోళ్లు, గొర్రెలు, మేకల కొనుగోళ్లకు, రవాణా కోసం వినియోగించే వాహనాలకు విపరీతంగా డిమాండ్ వచ్చింది.

# ఉద్యోగ, ఉపాధ్యాయ వేతనాలు సకాలంలో చెల్లించాలి

**టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య**

జగిత్యాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ వేతనాలు సకాలంలో చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య అన్నారు. ఆదివారం పట్టణంలో జరిగిన టీఎస్ యూటీఎఫ్ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడారు. ప్రతీ నెల ఒకటవ తేదీన జీతాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయ పదోన్నతులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఉన్నతి కార్యక్రమాన్ని, ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పీఆర్సీ, డీఏ ఏరియర్స్, పెండింగ్ బిల్లుల మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మల్టీ జోన్-2 పరిధిలో గెజిటెడ్ హెడ్మాస్టర్లకు ప్రమోషన్స్ ఇవ్వాలన్నారు. విద్యాభివృద్ధికి తరగతికి ఒక ఉపాధ్యాయున్ని నియ మించి నాణ్యమైన విద్యను అందించాలని తెలిపారు. అన్ని గురుకులాల ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించి వారికి బదిలీలు, ప్రమోషన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్స్ మంజూరు చేయాలని, మోడల్ స్కూల్స్‌లో బదిలీలు, పదోన్నతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుకోవెల శ్యామ్ సుందర్, ప్రధాన కార్యదర్శి అంబటి భూమేశ్వర్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కోశాధికారి మానుపాటి బన్న, కార్యదర్శి తులసి ఆగమయ్య, నాయకులు పీవీ ప్రసాద్, గడ్డల శ్రీధర్, ఖలీద్ పాషా, అనిల్ కుమార్, జ్యోతి, బాల్లా సత్యనారాయణ, తెలంగాణ మైనార్టీ గురుకుల ప్రధాన కార్యదర్శి రాకేశ్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

## భాగ్యరెడ్డి వర్మ ఆశయాలను కొనసాగిస్తాం



భాగ్యరెడ్డి వర్మకు నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 18: భాగ్యరెడ్డి వర్మ ఆశయాలను కొనసాగిస్తామని వివిధ దళిత సంఘాల నాయకులు అన్నారు. ఆదివారం మాతా శిశు ఆరోగ్యకేంద్రం సమీపంలో గల భాగ్యరెడ్డి వర్మ విగ్రహం వద్ద భాగ్యరెడ్డి వర్మ 85వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భాగ్యరెడ్డి వర్మ హైదరాబాద్‌లో 150 పాఠశాలలను స్థాపించి ఎంతో మందికి విద్యాదానం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దళిత, సామాజిక సంఘాల నాయ కులు స్వచ్ఛంద సంస్థల నాయకులు కొరివి అరుణ్ కుమార్, మేడి మహేశ్, కొరివి వేణు గోపాల్, తాళ్ళ వెంకటేశ్, గంటల మహేందర్, పాటాకుట భూమయ్య, నాయని ప్రసాద్, కుక్క లక్ష్మీరాజం, కర్నే పవన్ కుమార్, సొనాది వెంకటేష్, కాంపల్లి రమణకుమార్, ఇరుకుల్ల యాదగిరి, గోపాల భూషన్‌రావు, బుర్ర సోమయ్య, శ్రీపాది సదానందం తదితరులు పాల్గొన్నారు.

### అలయెన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్‌గా సత్యనారాయణ

సుభాష్‌నగర్: 137బి అసోసియేషన్ ఆఫ్ అలయెన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్‌గా కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన పోలు సత్యనారాయణ నియమి తులయ్యారు. అలాగే జిల్లా వైస్ గవర్నర్-1గా డాక్టర్ యెలిగేటి మల్లికార్జున్ నియమింపబడ్డారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన 14వ దక్షిణ మల్టిపుల్ కన్వెన్షన్ సమావేశంలో ఈమేరకు వారిని నియమించారు. వీరి నియామకం పట్ల కరీం నగర్ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు గడ్డం శ్రీరాములు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్య క్షుడు డాక్టర్ ఆడెపు శ్రీనివాస్, అలయెన్సు మోర అంజ య్య, డాక్టర్ వేణుకుమార్, పసుల సతీష్, పలువురు అయ్యప్ప గురుస్వాములు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

# పేదల జీవితాలతో ఆడుకుంటున్న కేంద్ర ప్రభుత్వం

**- సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 18: దేశంలోని పేదల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం ఆడుకుంటోందని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం సిరిసిల్ల పట్టణంలోని ఓ ఫక్షన్ హాల్‌లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా స్థాయి సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి చాడ వెంకటరెడ్డి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిసుత్తన్న ఆర్థిక, మతతత్వ విధానాల ఫలితంగా ప్రజల జీవనాధాయం పడిపోతూ మరింత పేదలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలో రైతాంగ పోరాటాల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరిస్తూ రైతులకు లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చిందన్నారు. కానీ నేటికీ వాటిని అమలు చేయలేదన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలని చూస్తోందని ఆరోపించారు. రైతాంగ పోరాటంలో చనిపోయిన 700 మంది రైతుకుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వలేదని మూడు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో రైతు చట్టాలను ఉపసంహరించుకుంటున్నామని చెప్పి మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు తలొగ్గి పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను పెంచారని ఉపాధిహామీ కార్మికుల కూలీ పెంచడం లేదని ఆరోపించారు. గ్రామాల్లో పనిచేసే కూలీలకు రూ. 500లు ఇస్తున్నారని కేంద్ర గ్రామీణ ఉపాధి కూలీలకు రోజుకు రూ. 600ల కూలిని కేంద్ర ప్రభుత్వం ఎందుకు ఇవ్వదని ప్రశ్నించారు. ప్రపంచంలోనే భారతదేశంను మూడో ఆర్థిక సంపన్న అభివృద్ధి దేశంగా తీర్చిదిద్దామని చెప్పుకుంటున్న మోదీ గ్రామీణ ఉపాధి కూలీలు గుడిసెల్లో ఉంటూ కూలీ పని చేసుకుంటున్నారన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం బడ్జెట్ పెరుగుతుంది తప్పా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం బడ్జెట్ పెరగడం లేదని ఆరోపించారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం బడ్జెట్ తగ్గించడం అంటే పేదవారి జీవితాలతో ఆడుకోవడమేనని అన్నారు. ఉపాధి హామీ కార్మికులకు 200రోజుల పనికల్పిస్తూ 15 రోజులకు ఒక్కసారి వేతనాలు చెల్లించాలని కార్మికుడు చనిపోతే రూ. 10 లక్షలు ఆ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్న నమ్మకం ఉందన్నారు. ప్రజల మౌలిక సదుపాయాలు తీర్చాలని అందులో విద్యా, వైద్యం, గ్రామీణ ఉపాధిహామీ పథకాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఏ ప్రభుత్వాలు వచ్చినా ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలపైన ప్రశ్నించాల్సిందేనని అందులో సీపీఐ అనుబంధ సంఘాలు ముందు వరుసలో ఉంటాయన్నారు. నాడు మంత్రిగా కేటీఆర్ రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకురావడం కోసం దేశ, విదేశాలు తిరగాడు తప్పా సిరిసిల్లలోని పేద ప్రజలకు ఇంటి స్థలాలు, ఇంటి నిర్మాణాలకు ఆర్థిక సహాయం చేయలేదని పేద ప్రజలను ఏనాడు పట్టించుకోలేదని మండిపడ్డారు. సదస్సులో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం బాలమహేష్, జిల్లా కార్యదర్శి జంగం అంజన్న, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు, మధ్యాహ్న భోజన పథకం జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మేని లక్ష్మణ్, ఉపాధి హామీ పథకం కార్మికులు పాల్గొన్నారు.

## ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 18: సీవీరామన్ సైన్స్ ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ ఈ-టెక్నో విద్యార్థులు రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకులు సాధించారు. ఆదివారం పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ర్యాంకులు సాధించిన విద్యార్థులు అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సైన్స్‌లో పలు సంస్కరణలు రూపొం దించిన గొప్ప వ్యక్తి సీవీ రామన్ అన్నారు. రామన్ ప్రవేశపెట్టిన సిద్ధాంతాలు నేటికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయన్నారు. సైన్స్‌లో పట్టు సాధించడానికి పాఠశాలలోనే విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి అర్హత పరీక్షల్లో ర్యాంకులు సాధించే విధంగా కృషి చేస్తున్నామని ఆయన అన్నారు. రాష్ట్ర స్థాయిలో శివస్మరణ్‌రెడ్డి, అన్షుల్, కె శ్రీచరణ్‌రెడ్డిలు ర్యాంకులు సాధించగా జిల్లాస్థాయిలో ఎస్‌పి క్రిష్ణచైతన్య, ఎస్ వినాయక్, జిసాయి సంహిత్, సహర్షలతో పాటు ఎంతోమంది విద్యార్థులు ర్యాంకులు సాధించారన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

### దరఖాస్తుల స్వీకరణ

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 18: నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తిపన్ను చెల్లింపులపై ఏమైనా అభ్యంతరాలుంటే కమిషనర్‌ను కలిసి దరఖాస్తు సమర్పించవచ్చని నగర పాలక సంస్థ కమిషనర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 31వ తేదీతో ఆర్థిక సంవత్సరం ముగియనున్నందున అభ్యంతరాలేమైనా ఉంటే ప్రతి మంగళవారం, శుక్రవారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

### యువతి వివాహానికి చేయూత

పాలకుర్తి, ఫిబ్రవరి 18: పాలకుర్తి మండలం పరిధిలోని బామ్లానాయక్ తండాకు చెందిన ఇస్లావత్ తిరుపతి లక్ష్మి కుమార్తె చామంతి సాగర్ వివాహానికి మాజీ సర్పంచ్ రాజునాయక్ 10వేల రూపాయల చెక్కును అందజేశాడు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు ఇస్లావత్ రాజు, సామెల్, సమ్మక్క, సన్మీ, భూక్య రాజేష్, కుటుంబ సభ్యులు రవి ప్రకాష్, లోకేష్, అంజీ తదితరులు పాల్గొన్నారు.

### బౌద్ధ సొసైటీని సందర్శించిన జడ్పీ చైర్మన్

మంథని, ఫిబ్రవరి 18: విశాఖపట్నంలోని బౌద్ధ సొసైటీని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా బౌద్ధ సొసైటీలో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్, రమాభాయి, బుద్ధుని విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, అంబేద్కర్ భవన్ అధ్యక్షుడు బొడ్డు కళ్యాణ్‌రావు, మెంబర్ బొడ్డు రాజు ఉన్నారు.

### దివ్యాంగులకు సింగరేణి ఉద్యోగి చేయూత

రామగిరి, ఫిబ్రవరి 18: రామగిరి మండలం కల్వచర్ల గ్రామపంచాయతీ పరిధిలోని గోకుల్‌నగర్‌కు చెందిన కొయ్యడ అనిల్, గంగినేని పవన్ కుమార్‌లు చిన్ననాడే పోలియోకు గురికాగా సింగరేణి ఉద్యోగి రేండ్ల కుమారస్వామి రూ.20వేల విలువైన బ్రేక్‌వీల్ చేర్, అలయ్‌వీల్ చైర్‌లను కుటుంబ సభ్యుల సమక్షంలో ఆదివారం అందజేశాడు.

### సీసీ రోడ్డు పనులకు భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

రామగిరి, ఫిబ్రవరి 18: రామగిరి మండలం రత్నాపూర్‌లోని 7వ వార్డులో ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు చొరవతో మంజూరైన సీసీ రోడ్డు పనులను ఆదివారం ఎంపీపీ ఆరెల్లిదేవక్క కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తొట్లతిరుపతి యాదవ్, నాయకులు బండారి సదానందం, కొండ అంజన్న, దేవునూరి శ్రీనివాస్, బొల్లపల్లి స్వామిగౌడ్, ఎరుకల బాబురావ్, వనం రాంచందర్‌రావు, తీగల సమ్మయ్య, మట్ట రాజ్‌కుమార్, కురిమిళ్ళ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### ఏసీపీని కలిసిన ఎంపీపీ

రామగిరి, ఫిబ్రవరి 18: రామగుండం ఏసీపీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఏసీపీ మడత రమేశ్‌ను ఆదివారం రామగిరి ఎంపీపీ ఆరెల్లిదేవక్క సీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంటగా బుద్దార్థి బుచ్చన్న, సమ్మయ్య, ఆరెల్లి కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

### వడుకాపూర్‌లో అపరిచిత వ్యక్తి సంచారం

**-వెంబడించి పట్టుకున్న గ్రామస్థులు**

జూలపల్లి, ఫిబ్రవరి 18: జూలపల్లి మండలం వడుకాపూర్ గ్రామంలోకి ప్రవేశించిన ఒక అపరిచిత యువకుడు శనివారం అర్ధరాత్రి సమయంలో ప్రజల్ని తీవ్ర భయాందోళనకు గురిచేశాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం ప్రజలు నిద్రిస్తున్న సమయంలో ఇళ్లలోకి చొరబడేందుకు ప్రయత్నించగా ప్రజలు ప్రతిఘటించడంతో అపరిచితుడు పరుగులు తీసాడు. దగ్గరకు వచ్చేవారిపై దాడి చేసేందుకు అపరిచిత యువకుడు ప్రయత్నించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఎట్టకేలకు అతన్ని పట్టుకున్న గ్రామస్థులు జూలపల్లి పోలీసులకు అప్పగించారు.

### తెలంగాణ లెక్చరర్ ఫోరం క్యాలెండర్ ఆవిష్కరణ

ధర్మారం, ఫిబ్రవరి18: ధర్మారం మండల కేంద్రంలోని స్వామి వివేకానంద డిగ్రీ కళాశాలలో తెలంగాణ లెక్చరర్ ఫోరం (టీఎల్ఎఫ్) క్యాలెండర్‌ను ఆదివారం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమన్వయకర్త పోకల నాగయ్య, నాయకులు సత్యనారాయణ., భాస్కర్, మదన్మోహన్, మల్లేశం, రాజశేఖర్, మహేందర్, చంద్రమౌళి, సురేందర్, చంద్రయ్య తదితరుల పాల్గొన్నారు.

### బాక్సింగ్‌లో విద్యార్థులకు బంగారు పతకాలు

ఓదెల, ఫిబ్రవరి 18: ఓదెల మండలంలోని కనగర్తి దాసరి పద్మ, హనుమయ్య హైస్కూల్‌కు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు బాక్సింగ్ టోర్నీలో బంగారు పతకాలు సాధించారు. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో ఆదివారం బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలో కనగర్తి హై స్కూల్ కు చెందిన రాయుళ్ల కళ్యాణి, పెడెం కావ్య శ్రీ, దామరిషి చరణి, వేల్పుల అక్షిత, కొలిపాక అక్షర, రాయిళ్ల బాలరాజు, ఒల్లే అక్షయ్ కార్తీ, పెండెం పవన్, బాక్సింగ్ పోటీలో బంగారు పతకాలను సాధించగా అనంతరం సోమవారం హైదరాబాదులో నిర్వహించే రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీకి ఈ విజేతను ఎంపిక చేశారు. అలాగే ఇదే హైస్కూల్ కు చెందిన పెడెం అభినయ, దొడ్డి వైష్ణవి లకు జిల్లా స్థాయి కబడ్డీ జట్టులో చోటు సంపాదించారు.అనంతరం రాష్ట్ర స్థాయి టోర్నీకి ఎంపిక అయ్యారు. రాష్ట్ర స్థాయికి ఎంపిక అయిన విద్యార్థులను ఎంఈఓ రాజయ్య, హెచ్ఎం రమేష్ గ్రామస్తులు అభినందించారు.

### ఆర్థిక సహాయం అందజేత

కొడిమ్యాల, ఫిబ్రవరి 18 : గుండెకు రంధ్రంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్సకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న మండల కేంద్రానికి చెందిన చిలువేరి నరే ష్‌శరణ్యా దంపతుల నాలుగు నెలల చిన్నారి దన్విక‌కు ఆదివారం మండలంలోని పూడూర్ గ్రామానికి చెందిన ఏ గుర్ల గణేష్‌మౌనిక దంపతులు 8 వేల రూపాయలను అందించారు. గణేష్‌మౌనికల కూతురు మొదటి పుట్టిన రోజు వేడుకలకు అయ్యే ఖర్చును పుట్టిన రోజు వేడుకల కు బదులుగా తాము చిన్నారి గుండె చికిత్సకు అందిస్తు న్నట్లు వారు తెలిపారు. ఇటీవల మండల కేంద్రానికి చెం దిన బీఆర్ఎస్ నాయకులు సింగిరెడ్డి వసంతతిరుపతిరెడ్డి 10వేల రూపాయలను, ఇండో ఇంగ్లీష్ స్కూల్ యజమాని బోబీ జోసఫ్ 5వేల రూపాయలను అందించారు. దాత లకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

### మాదిగల జోడో యాత్రను విజయవంతం చేయండి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 18: ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని, ఎస్సీ వర్గీకరణ కోసం మదిగలను ఐక్యం చేసేందుకు ఈనెల 23న జిల్లా కేంద్రంలో తలపెట్టిన మాదిగల జోడో యాత్రను విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా ఇంచార్జీ మెడపట్ల దుబ్బయ్య పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పది జిల్లాల్లో ఈనెల 21 నుంచి 29 వరకు నిర్వహించే ఈ యాత్ర హైదరాబాద్‌లో ప్రారంభమై 23న కరీంనగర్‌కు చేరుకుంటుందన్నారు. మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్, జగిత్యాల జిల్లా మాదిగ యూత్ అధ్యక్షుడు డి చైతన్య, కరీంనగర్ మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బండ శ్రీనివాస్, లంక తిరుపతి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నైపుణ్య శిక్షణ

గణేశ్‌నగర్, ఫిబ్రవరి18: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జ్‌సెంటర్ ఆధ్వర్యంలో నాంది ఫౌండేషన్ ద్వారా మహేంద్ర ప్రైడ్ క్లాసు ట్రైనింగ్ నిర్వహించారు. ఈ మహేంద్ర ప్రైడ్ క్లాస్ రూమ్ ట్రైనింగ్ 12 ఫిబ్రవరి నుంచి 17 ఫిబ్రవరి వరకు రెండు బ్యాచ్‌లు జరిగాయి. 120 మంది విద్యార్థులు శిక్షణ పొందారని ప్రిన్సిపాల్ డాక్టర్. టి.శ్రీలక్ష్మి తెలియజే శారు. టాస్క్ కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.శోభరాణి, ఈ ఎంపీసీ శిక్షణ ద్వారా లైఫ్‌స్కిల్స్, ఎంప్లాయబిలిటీ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ ఆప్టిట్యూడ్ గురించి శిక్షణ ఇచ్చారు. మహీంద్రా ప్రైడ్ క్లాస్‌రూం నుంచి వచ్చినటువంటి ట్రైనర్ ఓం ప్రకాష్ చివరిరోజు మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. టాస్క్ ఎఫ్‌టియం జి.రాజశేఖర్, ఫైనల్ సెమిస్టర్ విద్యార్థులు ఉన్నారు.

### సమ్మక్క జాతరకు మేయర్‌కు ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 18: రేకుర్తిలో ఈనెల 21 నుంచి 24 వరకు జరిగే సమ్మక్క సారలమ్మ జాతరకు రావాల్సిందిగా నగర మేయర్ సునీల్‌రావుకు ఆదివారం ఆహ్వానపత్రం అందజేశారు. జాతర అధికారి ఎండపెల్లి మారుతి, వ్యవస్థాపక చైర్మన్ పిట్టల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.